సాక్షి
నిర్మల్
శుక్రవారం, 11, ఆగస్టు, 2023



ప్రాజెక్టు తెగింది... ఉపాధి ఆగింది

139 ఏళ్ల క్రితం నిర్మించిన సిరాల ప్రాజెక్టు చుట్టుపక్కల పల్లెల్లో మత్స్యకార కుటుంబాలకు జీవనాధారం. ఇటీవలి వర్షాలకు తెగడంతో మత్స్యకార కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. 8లో▸



కూలీలు దొరుకుతలేరు..!

జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత నెలకొంది. వర్షాల కారణంగా పత్తి, సోయా, మినుము, పెసర వంటి చేలల్లో కలుపు పెరిగింది. కూలీలు దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.6 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. గాలిలో తేమ కారణంగా వేడిగా, ఉక్కపోతగా అనిపిస్తుంది. అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

మసక మసక చీకటిలో..

మందుబాబుల హల్‌చల్

- మద్యం షాపుల ముందే అడ్డాలు
- నిర్మల్‌లో రోడ్ల పక్కన, ఓపెన్ ప్లేస్‌లలో మద్యం సిట్టింగ్‌లు



ఈద్గాం చౌరస్తాలోని వైన్ షాప్ సమీపంలో రోడ్డు పక్కనే మద్యం తాగుతున్న మందుబాబులు

నిర్మల్ టౌన్: జిల్లాలో వైన్స్ చుట్టుపక్కల మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలో జనావాసాల మధ్య, బస్టాండ్లకు సమీపంలో, ప్రధాన కూడళ్లలోనే మద్యం దుకాణాలు ఉండడంతో ప్రయాణికులు, దూర ప్రాంతాల నుంచి రాత్రి వేళ పట్టణాలకు వచ్చే మహిళలు, యువతులు, కాలేజీలు, స్కూళ్లు, ట్యూషన్ల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నగర శివారులోని ఓ వ్యక్తి రోడ్డు పక్కనే ఉన్న వైన్స్‌లో తాగి అటుగా వెళుతున్న యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆపై ఆమెను రోడ్డుపైనే వివస్త్రను చేశాడు. ఈ నేపథ్యంలో జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో మద్యం షాపుల వద్ద పరిస్థితి తెలుసుకునేందుకు 'సాక్షి' విజిట్ చేసింది.

పర్మిట్ రూం ఉన్నా ఆరుబయటే..

ప్రభుత్వం ప్రతీ మద్యం షాపుకు పర్మిట్ రూం అనుమతి ఇచ్చింది. కొన్ని షాపుల్లో రద్దీ కారణంగా, కొన్ని షాపుల్లో పర్మిట్ రూంలు అపరిశుభ్రంగా ఉన్న కారణంగా మందుబాబులు షాపుల పక్కనే, సమీపంలోని ఓపెన్ ప్లేస్‌లలో మద్యం తాగుతున్నారు. ఇక యువకులు అయితే.. మైదానాలు, చీకటి ఉండే ఓపెన్ ప్లేస్‌లలో అడ్డాలు వేస్తున్నారు. ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో మందు తాగుతున్నారు.

8 దాటితే భయం..



మంచిర్యాల చౌరస్తాలోని వైన్స్ ముందు..



బస్టాండ్ ఎదుట వైన్‌షాప్ వద్ద బహిరంగంగా..

పట్టణాల్లో రాత్రి 8 దాటిందంటే మద్యం దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఏ వైన్స్ చూసినా రద్దీనే కనిపిస్తుంది. దీంతో ఆ సమయంలో రోడ్లపై నడుచుకుంటూ వెళ్లడానికి కూడా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లి ఇళ్లకు వచ్చే వారు భయం భయంగా ఇళ్లకు వెళ్తున్నారు. నిర్మల్ పట్టణంలో ప్రధాన కూడలైన ఈద్గా చౌరస్తాలోని ఒక వైన్స్‌కు సమీపంలోనే పాఠశాల ఉంది. భైంసా బస్‌స్టాప్‌తోపాటు, మార్కెట్ ఏరియాలో వైన్స్ ఉండడంతో సాయంత్రం అటువైపు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. నిర్మల్ బస్టాండ్ ఎదుట, మంచిర్యాల్ చౌరస్తా, మంజులాపూర్ రోడ్, శాంతినగర్ చౌరస్తా, చైన్‌గేట్ ప్రాంతాల్లోని వైన్స్ వద్ద ఓపెన్‌గానే మద్యం తాగుతున్నారు. నియంత్రించాల్సిన పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం సీసాలు రోడ్ల పక్కన, డ్రైయినేజీల్లో పడేస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.

భైంసాలోనూ బహిరంగంగానే..



భైంసాలో షాపు వద్ద బహిరంగ మద్యపానం

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని బస్టాండ్ రోడ్, గాంధీగంజ్, కుభీర్‌రోడ్డుతోపాటు పట్టణ పరిధిలోని నిర్మల్–భైంసా జాతీయ రహదారి పక్కన మద్యం దుకాణాలున్నాయి. పలు మద్యం దుకాణాల వద్ద పర్మిట్‌రూంలు ఉన్నా కొన్ని షాపుల వద్ద బహిరంగంగానే మందుబాబులు మద్యం తాగుతున్నారు. దీంతో ఆయా మార్గాల్లో వెళ్లే మహిళలు, యువతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే భైంసా పట్టణంలో పోలీసుల ఆంక్షల నేపథ్యంలో దుకాణాలన్నీ రాత్రి 9 గంటలకే మూసివేస్తారు. రాత్రి 7 గంటల నుంచే పోలీసు పెట్రోలింగ్ ప్రారంభమవుతుంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగడం లేదు.

వీఆర్‌ఏలకు గౌరవ హోదా

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో వీఆర్‌ఏలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపుతోపాటు గౌరవప్రదమైన హోదా దక్కిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో వీఆర్‌ఏలు, జూనియర్ పంచాయతీ సెక్రెటరీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్డర్ కాపీలు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వీఆర్‌ఏలు కలలో కూడా ఊహించని విధంగా కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. జిల్లాలో 559 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందారన్నారు. ఖాళీలు లేకపోవడంతో 26 మందికి మహబూబ్‌నగర్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వీరికి కూడా సొంత జిల్లాలో పోస్టింగ్ వచ్చేలా ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీలను సుందరంగా తీర్చిదిద్దిన జూనియర్ పంచాయతీ సెక్రెటరీలకు సరైన న్యాయం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేస్తూ.. వారి కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. వీఆర్‌ఏ, జేపీఎస్‌ల కష్టానికి ఫలితం దక్కిందన్నారు. అందరూ నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించబడతారని తెలిపారు. అనంతరం వీఆర్‌ఏ, జేపీఎస్ సంఘాల నాయకులు మంత్రి, కలెక్టర్‌ను సత్కరించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గోల్డ్ మెడల్ అందజేత



సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన జెడ్ల నారాయణ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ వారు నిర్వహించిన అగ్రికల్చర్ డిప్లామా కోర్స్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. డిప్లామాలో గోల్డ్ మోడల్ సాధించాడు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఐకేరెడ్డి విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందించి సత్కరించారు.

చదువుతోనే గుర్తింపు



బ్యాడ్జి ప్రదానం చేస్తున్న డీఎస్పీ, తదితరులు

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థి దశ కీలకమని, విద్యతోనే పోటీ ప్రపంచంలో మనుగడ సాధ్యపడుతుందని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేవీఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలలో కెప్టెన్లకు గురువారం బ్యాడ్జి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడారు. సమాజంలో విద్యతోనే గుర్తింపు, నాణ్యమైన విద్యతోనే ఎదుగుదల ఉంటుందని తెలిపారు. స మాజాన్ని ముందుకు నడిపే గురుతర బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. బాధ్యత గల పౌరులుగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దేశంలో అధిక శాతం జనాభా యువతరమే అన్నారు. భావి భారత పౌరులుగా విద్యార్థులు దేశానికి ఉపయోగపడేలా ఎదగాల ని సూచించారు. మధ్య తరగతి తల్లిదండ్రులకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో తక్కువ రుసుముతో విద్యనందించటం అభినందనీ యమన్నారు. సంస్థ రాష్ట్ర చైర్మ న్ శ్యాంసుందర్, గౌరవ కార్యదర్శి సురేందర్, ప్రిన్సిపాల్ గోపాల్ కిషన్, ఏవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణం



చైర్మన్‌ను సన్మానిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామంలో కొలువైన కాల్వలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకమండలి గురువారం కొలువుదీరింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రవికిషన్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా వుజారాం మహేశ్, డైరెక్టర్లుగా పోటూరి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల చిన్న నర్సయ్య, ప్రీతంరెడ్డి, అంగోత్ విమల, ధమ్మ మహేశ్, పూదరి శివ ప్రమాణం చేశారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నూతల పాలక మండలి సభ్యులను సత్కరించారు. పురాతన ఆలయాన్ని రూ.2.25 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.కోటితో 2,500 మంది భక్తులు వీక్షించే కల్యాణ మండపం నిర్మిస్తున్నామన్నారు. కోనేరు కూడా శిథిలావస్థకు చేరింది నూతనంగా నిర్మిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం 27వ ప్యాకేజీ కాలువకు కాల్వ నరసింహస్వామి కెనాల్ అని పేరు పెట్టారన్నారు. ఆలయానికి నూతన రోడ్డు, ఆలయ ఆవరణలో గోశాల నిర్మించుకున్నామన్నారు. ఆలయానికి బూదానం చేసిన చిన్న నర్సయ్యను అభినందించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



లోకేశ్వరం: ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీరోజు గస్తీ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నేర చరిత గల వ్యక్తులపై నిఘా ఉంచాలని తెలిపారు. ఆయన వెంట ఎస్సై సాయికుమార్, ఏఎస్సై దిగంబర్ ఉన్నారు.

ఫైలేరియాను తరిమేద్దాం

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ముందస్తు చర్యల ద్వారా జిల్లాలో ఫైలేరియా(బోదకాలు)ను తగ్గించవచ్చని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తుకారాం, డీఎంహెచ్‌వో ధనరాజ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బోదకాలు వ్యాధిని నిర్మూలించడానికి, అర్హులైన ప్రజలందరూ కూడా ఐవర్ మెక్టిన్, డీఈసీ, అల్బెండజోల్ మాత్రలు మింగాలని సూచించారు. తద్వారా వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉంటుందన్నారు. రెండేళ్ల వయసు దాటిన వారికి కూడా అల్బెండజోల్, డీఈసీ మాత్రలను వయసును బట్టి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఐదు సంవత్సరాల పైబడిన వారికి మూడు అడుగుల కంటే ఎత్తు ఎక్కువగా ఉన్నవారికి ఐవర్ మెక్టిన్ మాత్రలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ తుకారాం మాట్లాడుతూ జిల్లాలో ఫైలేరియా పాజిటివ్ రేట్ ఎక్కువగా ఉండటంతో మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నిర్భయంగా మాత్రలు వేసుకోవాలని సూచించారు.

మాత్రలు వేసుకున్న కలెక్టర్..

జిల్లాలో ఫైలేరియా నివారణకు వైద్యారోగ్య శాఖ చేపట్టిన మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాంలో విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు మొట్టమొదట ఫైలేరియా నివారణ మాత్రలు జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ అందరి సమక్షంలో కలెక్టర్ వేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, వైద్యులు రాజారమేశ్, శ్రీనివాస్, హెచ్‌ఎం జాఫర్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేణురావు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాత్రల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

భైంసాటౌన్: ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీలో రాష్ట్ర బృందం ప్రతినిధులు డాక్టర్ తుకారాం, వెంకటేశం అన్నారు. భైంసాలోని ఏరియా ఆస్పత్రి, బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మాత్రల పంపిణీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. వయసు, ఎత్తును బట్టి మాత్రల మోతాదు పాటించాలన్నారు. గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లలు, తీవ్ర వ్యాధులతో బాధపడే వారికి డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు వేయించొద్దని తెలిపారు. ఐదేళ్లు, మూడు అడుగుల కంటే తక్కువ ఎత్తున్న ఉన్నవారికి ఐవర్‌మెక్టిన్ మాత్రలు వేయించొద్దని సూచించారు. బృందం వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్, హెచ్‌ఈవో ఉన్నారు.

'గృహలక్ష్మి' వరించేదెవరినో..!



మున్సిపల్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు పోటెత్తిన అర్జీదారులు

- మూడు రోజుల్లో 48 వేల దరఖాస్తులు
- జిల్లాకు 7,800 యూనిట్ల కేటాయింపు
- గడువు పెంచాలని ప్రజల వినతి

నిర్మల్‌చైన్‌గేట్: ఏళ్లుగా ఊరిస్తున్న గృహలక్ష్మి పథకానికి మూడురోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా 48 వేల అర్జీలు వచ్చాయి. మూడురోజుల గడువుతోనే దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలతోపాటు 18 మండలాల్లో చాలామంది పనులు మానేసి గృహలక్ష్మి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కిటకిటలాడాయి. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. కానీ వచ్చిన దరఖాస్తులను చూసి 'గృహలక్ష్మి' వరించేది ఎవరినో అని అధికారులే విస్తుపోతున్నారు.

జిల్లాకు 7,800 యూనిట్లు..

ఇక ప్రభుత్వం జిల్లాకు 7,800 గృహలక్ష్మి యూనిట్లు కేటాయించింది. పథకం వర్తించాలంటే అర్జీదారు వార్షిక ఆదాయం పట్టణాల్లోనైతే రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతవాసులైతే రూ.1.50 లక్షలకు మించి ఉండరాదు. వార్షిక ఆదాయాన్ని ధ్రువీకరిస్తూ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదాయ ధ్రువపత్రం జతపర్చాలి. ఈ కారణంగా తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌కం సర్టిఫికెట్ కోసం జనం పోటెత్తారు.

గడువు పెంచాలని డిమాండ్

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పెంచాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సాధారణ మహిళలకు చాలా మందికి సర్టిఫికెట్లు లేవని, మీసేవల్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేయడానికి వారం రోజులైనా పడుతుందని అంటున్నారు. మద్యం టెండర్లకు నెల రోజులు గడువు, నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే గృహలక్ష్మి పథకానికి మూడు రోజులే సమయం ఇవ్వడం సరికాదంటున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు పెంచాలని కోరుతున్నారు.

క్రమబద్ధీకరణ పోరు



జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

- సెకండ్ ఏఎన్‌ఎంల నిరవధిక సమ్మె
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో 220 మంది

నిర్మల్‌చైన్‌గేట్: పుట్టిన శిశువు నుంచి వృద్ధుల వరకు వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ, ఎప్పటికప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు అందించే సెకండ్ ఏఎన్‌ఎంలు ఆందోళనబాట పట్టారు. తమను రెగ్యులర్ చేయాలంటూ ఉద్యమిస్తున్నారు. జిల్లాలో 220 మంది సెకండ్ ఏఎన్‌ఎంలు రూ.4 వేల వేతనంతో కాంట్రాక్టు పద్ధతిన 2008 నుంచి పని చేస్తున్నారు. వీరికి ఏడాదికి 15 రోజులు మాత్రమే సెలవులు ఇస్తుండగా మిగిలిన 350 రోజులు విధులు నిర్వహించాల్సిందే. ఇంత శ్రమిస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల దాదాపు 1,520 ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్టు పద్ధతిన 180 రోజులు పనిచేస్తే వారిని రెగ్యులర్ చేసేలా జీవో ఉన్నా.. 15 ఏళ్లుగా మారుమూల గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయకుండా కొత్త నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని అంటున్నారు. ఇటీవల చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టిన ఏఎన్‌ఎంలను పోలీసులు ముందస్తుగానే అరెస్టు చేశారు. దీంతో నిరవధిక సమ్మె చేస్తున్నారు.

2007లో విధుల్లోకి..

నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 2007లో రూ.4,200 వేతనాలతో రెండో ఏఎన్‌ఎంలు విధుల్లో చేరారు. 2017లో ప్రభుత్వం వీరి వేతనాలను రూ.25 వేలకు పెంచింది. జిల్లాలో 122 మంది రెండో ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్‌ఎంలకు దీటుగా రెండో ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. ఆయా ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్‌ఎం తర్వాత పనిచేసే వీరిని రెండో ఏఎన్‌ఎంగా పిలుస్తున్నారని, వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో, హెల్త్ సర్వేలో మారుమూల పల్లెలకు, ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించామంటున్నారు.

రెండో ఏఎన్‌ఎంల విధులు..

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఒకే పని, ఒకే విద్యార్హతతో మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా పని చేస్తున్నారు. కేంద్రాల్లో రోజుకు 16 గంటలు పనిచేస్తున్నారు. ఇమ్యూనైజేషన్, 36 రికార్డులతోపాటు, ఆన్‌లైన్‌లో 18 మొబైల్ యాప్‌లను నిర్వహిస్తున్నారు. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లడం, డెలివరీలకు రెఫర్ చేయడం, టీకాలు ఇప్పించడం వంటి పనులు చేస్తున్నారు. పోలియో, నులి పురుగుల నివారణతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ద్వారా విధుల్లో చేరిన సెకండ్ ఏఎన్‌ఎంలు రెగ్యులర్ కూడా చేయాలనే వాదన వినిపిస్తోంది.

డిమాండ్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసినట్లుగానే తమను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. 16 ఏళ్లుగా అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామని, కనీస వేతనం రూ.41 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రూ.10 లక్షల బీమా, దురదృష్టవశాత్తు ఎవరైనా మృతిచెందితే రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించాలని కోరుతున్నారు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో 50 ఏళ్లు పైబడిన వారు 60 శాతం ఉన్నారని, ఒక వైపు విధులు నిర్వర్తిస్తూ మరోవైపు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతారని ప్రశ్నిస్తున్నారు. కనీసం వెయిటేజీ కూడా ఇవ్వకపోతే నష్టపోతామని పేర్కొంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మొదటి ఏఎన్‌ఎంతో సమానంగా పనిచేస్తున్నాం. రెండో ఏఎన్‌ఎంలు అని అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారు. ఉద్యోగ భద్రత కూడా లేదు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో రెగ్యులరైజ్ చేయాలి.

– వి.సుజాత, సెకండ్ ఏఎన్‌ఎం

నోటిఫికేషన్ రద్దు చేయాలి..



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలి. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫలమైంది. – శోభారాణి, సెకండ్ ఏఎన్‌ఎం

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

- జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో గెలుస్తాం
- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



మాట్లాడుతున్న కూచాడి శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ బాధ్యతలు అప్పగించిందని, జిల్లాలో పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. బడుగు బలహీనవర్గాలు, మైనార్టీ, బహుజనుల సంక్షేమానికి కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పథకాలు, రానున్న ఎన్నికల్లో చేపట్టబోయే మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కల్లబొల్లి మాటలు, అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీహరిరావును క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు నాయకులు సత్కరించారు. సమావేశంలో పీసీసీ సభ్యులు సాదా సుదర్శన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజీద్ అహ్మద్‌ఖాన్, నాయకులు అర్జుమాన్ అలీ, చిన్ను, సబా కలీం, రాకేష్, ఈటెల శ్రీనివాస్, జగదీశ్వర్, కొంతం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ కాంట్రాక్టు పోస్టుల మెరిట్ జాబితా విడుదల

నిర్మల్‌ఖిల్లా: కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో సీఆర్టీ, పీజీసీఆర్టీ, పీఈటీ, నర్సింగ్ పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితా గురువారం విడుదల చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని 18 కేజీబీవీలలో సీఆర్టీ, పీజీసీఆర్టీ, పీఈటీ, నర్సింగ్ పోస్టులకు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్టీ పోస్టులకు ఇటీవల రాత పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించిన మెరిట్ జాబితాను నిర్మల్ జిల్లా విద్యా శాఖ వెబ్‌సైట్ deonirmalweebly. com లో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. మెరిట్‌లిస్ట్ నుంచి రోస్టర్ ప్రకారం ప్రతీపోస్ట్‌కు 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 1:3 మెరిట్ జాబితాలోని అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా రాకేశ్



ఎంబడి రాకేశ్



అంజాద్ షేక్

భైంసాటౌన్: ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా ఎంబడి రాకేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంజాద్‌షేక్ ని యమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బ ల్మూరి వెంకట్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తమపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కాలం చెల్లిన కల్యాణలక్ష్మి చెక్కు



కాలం చెల్లిన చెక్కు

నర్సాపూర్(జి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కల్యాణ లక్ష్మి పథకం అధికారుల నిర్లక్ష్యంతో అభాసు పాలవుతోంది. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారురాలికి గురువారం చెక్కు అందజేశారు. చెక్కుపై 6వ తేదీ 4వ నెల 2023 సంవత్సరం ఉంది. లబ్ధిదారురాలు గమనించక ఆ చెక్కును తీసుకొని బ్యాంకుకు వెళ్లగా చెక్కు గడువు ముగిసిందని బ్యాంకు అధికారులు తిరస్కరించారు. దీంతో చేసేదేమీ లేక ఇంటికి వెనుదిరిగారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొత్త చెక్కు మంజూరు చేయాలని కోరారు.

ద్విచక్రవాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. టూటౌన్ సీఐ అశోక్ వివరాల ప్రకారం.. ఈ నెల 8న ఆ కాలనీకి చెందిన జైస్వాల్ చంద్రప్రకాష్ రాత్రి సమయంలో ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేశాడు. ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల గాలించినా వాహనం ఆచూకీ లేకపోవడంతో గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పెట్రోల్‌లో నీళ్లు



పెట్రోల్ బాటిల్‌లో నీటిని చూపుతున్న వినియోగదారుడు సుభాష్

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్‌లో నీరు వస్తుందని కుభీర్ మండలంలోని చాత గ్రామానికి చెందిన వినియోగదారుడు సుభాష్ గురువారం ఆందోళన వ్యక్తం చేశాడు. రెండు రోజుల క్రితం వానల్‌పాడ్ పెట్రోల్‌బంక్‌లోకి వెళ్లి పెట్రోల్ పోయించుకున్నానని, వాహనం మొరాయించడంతో మెకానిక్ వద్దకు వెళ్లగా పెట్రోల్‌లో నీరు ఉందని గుర్తించాడని తెలిపాడు. వెంటనే మరోసారి పెట్రోల్ బంక్‌కు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ పోయించుకున్నానని, అందులోనూ నీరుందని గుర్తించి సిబ్బందిని ప్రశ్నించగా తమకేమి సంబంధం లేదని తెలిపారని, దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పాడు. ఈ విషయమై పెట్రోల్ బంక్ మేనేజర్‌ను వివరణ కోరగా ఇథనాల్ శాతం ఎక్కువగా ఉండడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని సమాధానమిచ్చాడు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ పరిధి లోని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్రీయ బాల స్వస్థ పథకంలో భాగంగా ఒప్పంద ప్రాతిపదికన మొబైల్ హెల్త్ టీం పురుషుల విభాగంలో రెండు, మహిళల విభాగంలో రెండు పోస్టులకు, ఆయుష్ ఫార్మాసిస్ట్ విభాగంలో ఒక పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ తెలిపారు. డీఫార్మసీ, బీఫార్మసీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. nirmal.telangana.gov.in నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, అర్హత పత్రాలు జతచేసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో 21లోగా సమర్పించాలన్నారు.

ప్రాజెక్టు తెగింది... ఉపాధి ఆగింది

- రోడ్డున పడిన మత్స్యకారులు
- నాలుగు గ్రామాల్లో 50 కుటుంబాలు
- కొట్టుకుపోయిన రూ.50లక్షల సెరికల్చర్
- చేపలన్నీ కొట్టుకుపోయిన వైనం



ప్రాజెక్టులో సెరికల్చర్ (ఫైల్)

భైంసా/భైంసారూరల్: సిరాల ప్రాజెక్టు తెగడంతో మత్స్యకార కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. 139 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టు చుట్టుపక్కల పల్లెల్లో మత్స్యకార కుటుంబీకులకు జీవనాధారమైంది. నాలుగు తరాలుగా ఈ ప్రాజెక్టునే నమ్ముకుని జీవనం వెల్లదీస్తున్నారు. తానూరు మండలం బోల్సా, బోసి, ఉమ్రి, భైంసా మండలం సిరాల గ్రామాల్లోని 50 కుటుంబాలు సిరాల ప్రాజెక్టుపైనే ఆధారపడి ఉపాధిని పొందుతున్నాయి. యేటా ప్రాజెక్టులో చేపలు పట్టడం, విక్రయించడంతోనే ఈ కుటుంబాలు జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. ఏళ్లుగా ఈ ప్రాజెక్టు నిండుగానే ఉంది. ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి నాలుగుసార్లు మాత్రమే ఎండిపోయింది. ఎప్పుడు నిండుకుండలా ఉండే ఈ ప్రాజెక్టు ఎంతోమంది మత్స్యకారులకు ఉపాధినిచ్చింది. అలాంటి ప్రాజెక్టుపై ఆధారపడిన మత్స్యకారులు ఉపాధిని కోల్పోయారు.

ఒక్కరాత్రిలో కొట్టుకుపోయింది...

సెరికల్చరర్ కోసం మత్స్యకార కుటుంబీకులు ఆరేళ్లుగా కష్టపడ్డారు. ఇప్పుడిప్పుడే పెట్టుబడులుచేతికి అందుతున్నాయి. ఇలాంటి తరుణంలో తాము గట్టెక్కిపోయామన్న ఆనంద పడుతున్న సమయంలోనే భారీ వర్షం కోలుకోని దెబ్బతీసింది. ఒక్కరోజు కురిసిన భారీ వర్షంతో సిరాల ప్రాజెక్టు గండిపడి కొట్టుకుపోయింది. ప్రాజెక్టు నీటిలో సెరికల్చరర్ కోసం ఏర్పాటు చేసిన సామగ్రి, పడవలు కొట్టుకుపోయాయి. వరద నీటిలో ఏడాదిగా పెంచుతున్న చేపలన్నీ కొట్టుకుపోయాయి. తెల్లారేసరికి నిండుగా కనిపించే సిరాల ప్రాజెక్టు బండరాళ్లతో వాగులాగా తయారైంది. ప్రధాన ఆయకట్టు తెగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మత్స్యకార కుటుంబీకులు జీవనోపాధి కోల్పోయారు.

తీవ్ర ఆవేదనలో...

పెంచుకున్నచేపలు పట్టుకునేలోపే భారీ వర్షానికి కొట్టుకుపోయాయి. ఏడాదంతా వారానికి రెండు సార్లు జాలర్లు వలవేసి చేపలు పట్టి విక్రయించేవారు. ప్రాజెక్టు వద్దే తాజా చేపలు అమ్ముడుపోయేవి. సిరాల ప్రాజెక్టులో మంచి చేపలు దొరుకుతాయని అందరు అక్కడికే వెళ్లేవారు. ప్రతివారం ఇక్కడే చేపలు విక్రయిస్తూ వచ్చిన ఆర్డర్లు తీసుకుని అందుకు తగ్గట్లుగా జాలర్లు చేపలను విక్రయించేవారు. ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఈ కుటుంబాలు తీవ్ర నిరాశలోపడ్డాయి. ఈ కుటుంబాలన్ని ఉపాధిని కోల్పోయాయి.

రూ.50లక్షలతో సెరికల్చర్...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 50 కుటుంబాలు సొసైటీగా ఏర్పడ్డాయి. సిరాల ప్రాజెక్టునే ఆధారంగా తీసుకున్న ఈ కుటుంబాలు ప్రభుత్వానికి విన్నవించి ఇక్కడ సెరికల్చర్ ఏర్పాటు చేశాయి. ప్రాజెక్టులో రూ. 50లక్షలతో సెరికల్చర్ ప్రారంభించారు. ప్రాజెక్టు మధ్యలో చేపపిల్లల పెంపకం, వాటి కోసం ప్రత్యేక పడవల్లో వెళ్లి రోజువారి ఫీడింగ్ ఇవ్వడంలాంటి పనులుచేసేవారు. ఏడాదంతా పిల్లలను వదులుతూ పెరిగినకొద్ది చేపలను పట్టి విక్రయిస్తు ఉపాధి పొందారు. ప్రాజెక్టు మధ్యలో సెరికల్చరర్ ఉండేది. ప్రధాన తూము నుంచి ప్రాజెక్టు వరకూ రెండు పడవల్లో వెళ్లేవారు. యేటా ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసేది. ప్రభుత్వం ఇచ్చే చేపపిల్లలను చెరువులోకి వదిలి వాటిని పెంచుకునేవారు.

ఉపాధి కోల్పోయాం



సిరాల ప్రాజెక్టుకు గండిపడడంతో మత్స్యకార కుటుంబాలన్ని రోడ్డునపడ్డాయి. మేమంతా తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాం. ఎన్నోఏళ్లుగా మా కుటుంబాలు ఈ ప్రాజెక్టును నమ్ముకుని బతుకుతున్నాం. రూ.50లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన సెరికల్చర్ కనుమరుగైంది. కళ్లముందే ఇలాంటి పరిస్థితులు చూస్తామను కోలేదు. ఏళ్లుగా కష్టపడ్డ కళ వరదనీటిలో కొట్టుకుపోయింది. ఏడాదంతా మా కుటుంబాలు ఏమిచేసి బతకాలో తెలియడం లేదు.

– దత్తు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు

లోన్‌పేరుతో బంగారు గొలుసు కొట్టేశాడు



బాధితురాలు బోజబాయి, భర్త చిన్నన్న

కుభీర్: మండల కేంద్రానికి చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి లోన్ వచ్చిందని మాయమాటలు చెప్పి రెండు తులాల బంగారు గొలుసు కాజేసిన ఘటన గురువారం మధ్యాహ్నం కుభీర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం... బోజబాయి బిందెతో నీళ్ల తీసుకుని ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి నీ పేరు బోజబాయా అని ఆరా తీశాడు. నీ కొడుకు పేరు గణేశా కదా అని అడిగాడు. బాధితురాలు అవును అని చెప్పింది. దీంతో సదరు వ్యక్తి ఆమెతో ఇంటికి వెళ్లి కూర్చుని మీకు రూ.50వేల లోన్ వచ్చిందని చెప్పాడు. బాధితురాలికి వికలాంగురాలైన కూతురు ఉండగా ఏదైనా లోను వచ్చిందనుకొని బోజబాయి నమ్మింది. వెంటనే జేబులో నుంచి డబ్బులు తీసి లెక్కపెట్టి రూ.35వేలే ఉన్నాయని, రూ.15వేలు తక్కువగా ఉన్నాయని, దక్కన్ బ్యాంక్ వద్దకు వస్తే మొత్తం డబ్బులు ఇస్తానని చెప్పాడు. అలాగే మెడలోని బంగారు గొలుసు తీసివేయాలని, లేకుంటే సార్లు నీవు ధనవంతురాలివి అనుకుంటారని చెప్పాడు. దీంతో బాధితురాలు బంగారు గొలుసు తీసి పక్షవాతంతో కాలు, చేతి పడిపోయి మంచంపై ఉన్న భర్త చిన్నన్నకు ఇచ్చి నడుచుకుంటూ బ్యాంక్ వద్దకు బయలుదేరింది. బ్యాంక్‌కు వెళ్లగా సదరు వ్యక్తి అక్కడ కనిపించలేదు. అతడు వారి ఇంటికి వచ్చి మీ భార్య గొలుసు ఇవ్వమందని చెప్పి గొలుసు తీసుకుని వెళ్లిపోయాడు. మోసపోయినట్లు భావించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపాడు.

శివాజీ బీడీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న

నర్సాపూర్(జి): శివాజీ బీడీ యాజమాన్యం బీడీ కార్మికులకు గత నెల రోజుల నుంచి పని కల్పించకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాటడం మానుకోవాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట కార్యదర్శి కె.రాజన్న హెచ్చరించారు. నర్సాపూర్ (జి) మండలంలోని రాంపూర్ గ్రామ శివాజీ బీడీ ఫ్యాక్టరీ ఎదుట తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 8వ తేదీ నుంచి దాదాపు 300 మంది బీడీ కార్మికులకు పని కల్పించకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని, వీరందరికీ వెంటనే పని కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కారణం లేకుండానే కార్మికులకు పని బంద్ చేయడం అన్యాయమన్నారు. నాసిరకమైన తునికాకు సరఫరా చేస్తూ నాణ్యమైన బీడీలు తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలన్నారు. నెలకు 26 రోజుల పని కల్పించాలని బీడీ కార్మికులందరికీ పీఎఫ్, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల శ్రమను దోచుకుంటూ యాజమాన్యాలు లాభాలు గడిస్తున్న కార్మికులకు మాత్రం నాణ్యమైన ఆకు సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందని, ఒక్కొక్క కార్మికురాలు నెలకు రూ.100 నుంచి 300 వరకు తునికాకు నష్టపోయి కంపెనీకి ఆకుకొని భర్తీ చేస్తూ కార్మికుల నిజ వేతనాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. కార్మికులకు కమీషన్ దారులకు వెంటనే పని కల్పించాలని లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న ఉపాధ్యక్షులు ఆర్. రామ లక్ష్మణ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న కోశాధికారి ఎండీ.గఫూర్, జిల్లా మహిళ నాయకులు లక్ష్మి, స్వరూప, సంఘవి, పోసాని, సువర్ణ, జయ, పావని పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన సీఈ



వరద గేట్లను పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాస్‌రెడ్డి

కడెం: కడెం ప్రాజెక్టును నీటిపారుదల శాఖ ఇన్‌చార్జీ సీఈ శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. వరద గేట్లు, స్పిల్‌వే, కౌంటర్ వెయిట్, జనరేటర్లను పరిశీలించారు. పూర్తిస్థాయి మరమ్మతుల గురించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈలు రవికుమార్, గణేశ్, విఠల్ తదితరులు ఉన్నారు.

రైతు బాగుంటే దేశం బాగుంటుంది



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రైతు బాగుంటే.. దేశం బాగుంటుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. రైతులందరూ సంఘటితంగా ఉండి ముందుకెళ్తే మంచి లాభాలు సాధించవచ్చన్నారు. ప్రతీ రైతు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేసుకోవాలన్నారు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ధర్నాలు చేసే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి తెలంగాణలో లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో రూ. 300 కోట్లతో ఆ యిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు పాకల రాంచందర్, డాక్టర్ సుభాష్, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు రమేష్, రాజేందర్ రెడ్డి, లక్ష్మణ్, సీఆర్డీ ప్రతినిధి రాజు, డ్రీమ్ కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులు మర్సుకోల, సునీల్ దుడ్‌బావునే

బేల: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ పంపు వద్ద గురువారం సాయంత్రం జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డోప్టాల గ్రామానికి చెందిన పొచ్చన్నకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే మహారాష్ట్రలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గజానన్ మర్సుకోల, సునీల్ దుడ్‌బావునే లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఏఎస్సై జీవన్, కానిస్టేబుల్ సలీం, సర్పంచ్ ఇంద్రశేఖర్ చేరుకుని రిమ్స్‌కు 108లో తరలించారు. ఇందులో గజానన్ మర్సుకోల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి మృతి

భైంసారూరల్: అధిక మాసంలో సోదరి ఇంటికి వస్తున్న హన్మంతు గంగాధర్(44) జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ఉమ్రి తాలుక మండల గ్రామానికి చెందిన హన్మంతు గంగాధర్ మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం భార్య అరుణతో కలిసి ద్విచక్రవాహనంపై భైంసాలో ఉండే తన చెల్లెలి ఇంటికి బయలుదేరాడు. గుజరాత్ నుంచి కరీనంగర్‌కు టైల్స్‌లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని పాంగ్రి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనానికి వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా భార్య అరుణకు గాయాలయ్యాయి. మృతుడికి ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడికి యత్నం

ఇచ్చోడ: మతిస్థిమితం లేని మహిళపై మద్యం మత్తులో ఒకరు లైంగికదాడికి యత్నించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్సై నరేశ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అడేగామ (కే) గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి మతిస్థిమితం లేని మహిళ ఉంది. గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన షేక్‌నూర్ కిన్వట్ నుంచి ఇచ్చోడ వైపు బైక్‌పై వస్తున్నాడు. బ్రిడ్జి వద్ద మతిస్థిమితం లేని మహిళను గమనించి మద్యం మత్తులో ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి యత్నించాడు. గ్రామస్తులు గమనించి షేక్‌నూర్‌ను పట్టుకుని పోలీస్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు మహిళ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మాస్టర్ ప్లాన్ పేరిట భారీ కుంభకోణం

- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణంలో కొత్త మాస్టర్ ప్లాన్ పేరిట అధికార పార్టీ నేతలు భారీ కుంభకోణానికి పాల్పడ్డారని బీజేపీ నేత మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ జోన్‌లో ఉన్న పంట పొలాలను ఇండస్ట్రీయల్ జోన్‌లోకి మార్చి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇండస్ట్రీయల్ జోన్‌లోని సోఫినగర్ ప్రాంతాన్ని కమర్షియల్ రెసిడెన్షియల్ జోన్‌గా మార్చి అక్కడ అధికార పార్టీ నేతలు ముందు కొన్న భూముల విలువలు అమాంతం పెంచుకొని కార్పొరేట్ సంస్థలకు అమ్ముకొని కోట్లు గడిస్తూ నిర్మల్ పట్టణ ప్రజలను నిండా ముంచుతున్నారన్నారు. గతంలో ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కు పెద్ద ఎత్తున నిరసన జ్వాలలు వినిపించినా రైతులు, స్థానిక ప్రజలను మభ్యపెట్టి, స్థానిక మంత్రి ఆ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నామని ప్రకటించి తిరిగి అదే తరహాలో మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడం సరికాదన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్‌తో రైతులు, స్థానిక ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని, వారి పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మహాధర్నా చేపడుతామని తెలిపారు.

నేడు బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్, మల్లికార్జున్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, కమల్ నయన్, సాదం అరవింద్, భూపతిరెడ్డి, వొడిసెల అర్జున్, నాయుడి మురళి, గాదె విలాస్, శ్రీరామోజు నరేష్, ప్రజాత్‌రావ్, భారత్ పాల్గొన్నారు.

పంటలపై గడ్డిమందు పిచికారీ



పోట్‌పల్లి(ఎం)లో ఎండిపోయిన సోయాపంట



ఎండిపోయిన పత్తి పంట

లోకేశ్వరం: మండలంలోని పోట్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన మాదవ్ గంగన్న తనకున్న ఐదు ఎకరాల్లో ఖరీఫ్‌లో మూడెకరాల్లో సోయా, రెండు ఎకరాల్లో పత్తి పంటలను సాగు చేశాడు. గురువారం బాధితుడు గంగన్న తెలిపిన వివరాల ప్రకారం... ఖరీఫ్‌లో సాగు చేసిన సోయా, పత్తి అనుకున్నట్లుగానే ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. బుధవారం ఉదయం ఎప్పటి మాదిరిగానే పంట చేనులోకి వెళ్లి చూసేసరికి పంటకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారని గుర్తించాడు. సోయా, పత్తి పంటలు గడ్డిమందు ప్రభావంతో పూర్తిగా ఎండిపోతున్నట్లు రైతు వాపోయాడు. ఏపుగా పెరిగిన పంటను చూసి దిగుబడులపై కొండంత ఆశ పెట్టుకోగా తనపై ఎవరో కక్ష గట్టిన దుండగులు పంటపై గడ్డిమందు పిచికారీ చేసి ధ్వంసం చేశారని బాధిత రైతు ఆవేదన వెలిబుచ్చాడు. బాధిత రైతు గంగన్న లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై సాయికుమార్ పంటలను పరిశీలించారు. పంటపై గడ్డి మందు పిచికారీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులను త్వరలో పట్టుకుంటామన్నారు. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికుమార్ ఈ సందర్భంగా వివరించారు.

బాధితులను రక్షించేందుకు ఎయిర్ బోట్స్

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్



ఎయిర్ బోట్స్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: వరదల్లో చిక్కుకున్న బాధితులను సులువుగా రక్షించేందుకు ప్రభుత్వం ఎయిర్ బోట్స్ అందించిందని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో ఎయిర్ బోట్స్ శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ, గడ్డన్న ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయన్నారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయని తెలిపారు. భారీ వర్షాలతో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయినపుడు వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు జిల్లాలో ఎయిర్ బోట్స్, లైవ్ జాకెట్స్, ట్యూబ్స్, రోప్ తీసుకువచ్చామని వివరించారు. మొత్తం 70 లైవ్ జాకెట్స్, 25 ట్యూబ్స్, 2 బోట్స్, 100 మీటర్ల రోప్ బండల్స్ జిల్లాకు వచ్చాయని తెలిపారు. వీటికి సహకరించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగా రెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం, ఆర్ఐలు రమేశ్, రామకృష్ణ, ఎంపీవో వినోద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతిని అభినందించిన ఎస్పీ



రమను అభినందిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

కడెం: ఎస్సైగా ఎంపికయిన మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల రమను జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్ గురువారం అభినందించారు. మారుమూల ప్రాంతం నుంచి ఎస్సైగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వివాహం, కుటుంబ బాధ్యతలు, ఇతర అడ్డంకులను అధిగమించి ఎస్సైగా ఎంపికైన రమ నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

సోన్: ఏపీలోని గుంటూరు జిల్లా నుంచి బతుకుదెరువు కోసం బొప్పారం గ్రామానికి వచ్చిన సునీత(22) భర్త సురేష్‌తో కలిసి జీవిస్తోంది. కుటుంబ కలహాలతో సునీత గురువారం గోదావరిలో దూకేందుకు వంతెన వద్దకు వెళ్లింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్ రెడ్డి, స్టేషన్‌రైటర్ భీమేశ్, హోంగార్డ్ ముత్యం వెళ్లి ఆమెను రక్షించి భర్తకు అప్పగించారు.

అర్లి వంతెనకు రూ.46 కోట్లతో ఆర్థికశాఖ అనుమతి



రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతులు లభించిన వంతెన

లోకేశ్వరం: మండలంలోని హావర్గ గ్రామ సమీపంలోని అర్లి వంతెన శిథిలావస్థకు చేరడంతోపాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముందు భాగం కూలిపోయింది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివేదించారు. దీంతో రూ.46 కోట్లు మంజూ రు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. త్వరలో టెండరు ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.